క్లుప్తంగా

'ప్రభుత్వ భూమి పరిరక్షించాలి'

భైంసాటౌన్: పట్టణంలోని కుంట ప్రాంతంలో ఉన్న మున్సిపల్‌కు చెందిన ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని మాజీ కౌన్సిలర్, బీజేపీ నాయకుడు కపిల్ సింధే కోరారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బి.రాజేశ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 133/2 సర్వే నంబర్‌లోని భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని.. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి



ఆవు కళేబరం

భైంసారూరల్: మండలంలోని పాంగ్రి గ్రామంలో బుధవారం విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన గాదేవార్ అడెల్లు ఆవు గ్రామ సమీపంలోని విద్యుత్ సరఫరా అవుతున్న స్తంభం తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని.. ప్రభుత్వం పరిహారం అందించాలని బాధితుడు వేడుకున్నారు.

నేడు ప్రజావేదిక

కుంటాల: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం డీఆర్డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీవో గట్టుపల్లి నవీన్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అంశాలను ప్రజావేదికలో వెల్లడిస్తారని ఆయన పేర్కొన్నారు.

అందుబాటులోకి తాగునీరు



సింగన్‌గాంలో నీరు తాగుతున్న జనం

సాక్షి ఎఫెక్ట్..

తానూరు: ఎండలు మండుతున్నా.. మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన చలి వేంద్రాల్లో నీటిసౌకర్యం కరువైంది. ఈనెల 21న సాక్షిలో 'ఈ చలివేంద్రాల్లో నీళ్లండవు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆయా గ్రామాల్లోని చలివేంద్రాల్లో నీటి సౌకర్యం కల్పించారు.

'తడిసిన ధాన్యాన్ని కొంటాం'

ఖానాపూర్: రైతులెవరూ ఆందోళన చెందవద్దని.. అకాల వర్షంతో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఖానాపూర్ పీఏసీఎస్ సీఈవో భూమి ఆశన్న తెలిపారు. బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. వర్షాలకు తడిసి రంగు మారిన ధాన్యాన్ని సైతం కొనాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఆత్మ చైర్మన్‌కు సన్మానం



రాంరెడ్డిని సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

నిర్మల్‌రూరల్: ఆత్మ చైర్మన్‌గా ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన కొండ్రు రాంరెడ్డిని బుధవారం మండలంలోని రత్నాపూర్‌కాండ్లీలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వీడీసీ సభ్యులు ఈర్ల హరికిష్ణ, సాయందర్, షేక్ మాజిద్ సాయన్న, గ్రామ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి వీణ పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ముధోల్: ఉపాధి నైపుణ్యాలను పెంచే లక్ష్యంతో యూఎస్ఎక్స్ సంస్థ ఆధ్వర్యంలో అందించే శిక్షణ, ఉద్యోగ అవకాశాలను మండలంలోని యువత సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం(ఈనెల 22వ తేదీ) నుంచి గురుకులాల్లో 30 రోజులపాటు ఆయా రంగాల్లో శిక్షణ ఇస్తామని.. ఇంటర్ పూర్తి చేసి 18 ఏళ్ల నుంచి 25 ఏళ్లవారు అర్హులన్నారు. ఆసక్తి కలిగినవారు ఈ నెల 30లోగా గురుకులంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 97045 50165 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తహసీల్దార్‌ను కలిసిన నేతలు

లక్ష్మణచాంద: మండలానికి వచ్చిన నూతన తహసీల్దార్ సరితను బుధవారం తన కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఇందులో నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, బిట్లింగ్ నారాయణ, ప్రతాప్‌రెడ్డి, లింగారెడ్డి, ఆశన్న, రవి, కిరణ్ ఉన్నారు.



డ్రెయినేజీలను శుభ్రం చేయరూ..

కుభీర్: మండలకేంద్రంలోని బట్టిగల్లీలో మురుగుకాల్వలను శుభ్రం చేసి పూడిక, వ్యర్థాలను పక్కనే పడేస్తున్నారు. దీంతో సదరు చెత్తాచెదారం మళ్లీ డ్రెయినేజీల్లోకి చేరడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలుస్తోంది. దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామని.. వెంటనే కాల్వలను శుభ్రం చేయించాలని స్థానికులు వేడుకుంటున్నారు.



కొనుగోలు కేంద్రంలోనే జొన్నలు

కుంటాల: మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కుంటాలలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కానీ హమాలీలు, లారీల కొరత కారణంగా కొనుగోళ్లలో, తూకం వేసిన బస్తాలను తరలించడంలో జాప్యం నెలకొంటుంది. అకాల వర్షంతో పంట కుప్పలు తడిసే ప్రమాదం ఉన్నందున.. వెంటనే కొనుగోలు చేసి తరలించాలని రైతులు వేడుకుంటున్నారు.



వికసించిన మే పుష్పం

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో ఆదెపు రాజేశ్వర్ ఇంటి వద్ద అరుదైన మే పుష్పం విరబూసింది. ఇది లిల్లీ జాతికి చెందిన దుంపరకం మొక్క. ఏటా ఏప్రిల్ నెల చివరలో మొగ్గ తొడిగి.. మే మాసంలో పూసే ఈ పుష్పాన్ని చుట్టుపక్కల వారు తిలకిస్తూ తమ సెల్‌ఫోన్లలో బంధించుకుంటున్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

ఖానాపూర్: పట్టణంలోని మార్కెట్ యార్డు చౌరస్తాలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. దేశంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొచ్చి స్థానికసంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించారని పేర్కొన్నారు. అనంతరం రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. అబ్దుల్ మాజిద్, చిన్నం సత్యం, షబ్బీర్ పాషా, యూసుఫ్‌ఖాన్, గంగనర్సయ్య, సలీంఖాన్, షౌకత్‌పాషా, కావలి సంతోష్, జహీర్ అహ్మద్, సచిన్, గోవింద్ లక్ష్మిపతి, సత్యం, అశోక్, రాజన్న తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సాంకేతిక విద్యను ప్రవేశపెట్టి.. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన మహనీయుడని పేర్కొన్నారు. నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, పార్టీ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నిర్మల్ ఆత్మ డైరెక్టర్లు రవి, కిరణ్, నాయకులు నారాయణ, నరేశ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ షఫీ, సాయిప్రసాద్ ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, ఏఎంసీ వైస్ చైర్మన్ షారూక్ అహ్మద్, నాయకులు రాజన్న, రాజేశ్వర్, సయ్యద్ ఆలా, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించి నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



లక్ష్మణచాందలో..



భైంసాలో నివాళులర్పిస్తున్న నారాయణరావు

సీహెచ్‌సీలో అధునాతన సేవలు

- ఖానాపూర్‌లో డిజిటల్ ఎక్స్‌రే యంత్రం
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే బొజ్జు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఖానాపూర్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో గురువారం నుంచి డిజిటల్ ఎక్స్‌రే సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే 50 పడకలు, 10 మంది పైనే వైద్యులుండగా.. నిత్యం ఓపీ 200 మంది వస్తుంటారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న సాధారణ ఎక్స్‌రే మిషన్ రెండేళ్లుగా పని చేయడం లేదు. దీంతో పట్టణవాసులు ఎక్స్‌రే కోసం ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీసేవారు. దీనికి తోడు డిజిటల్ ఎక్స్‌రే కోసమైతే నిర్మల్, మెట్‌పల్లి పట్టణాలకు వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు. ఈ ఖానాపూర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వస్తే నియోజకవర్గంలోని ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

ఇతర సమస్యలూ పరిష్కరించాలి..

ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యసిబ్బంది పోస్టులను భర్తీ చేసి ఇతర సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బొజ్జు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖానాపూర్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం

డిజిటల్ ఎక్స్‌రేలతో కచ్చితత్వం..

డిజిటల్ సెన్సార్‌లను ఉపయోగించి తీసే ఈ ఎక్స్‌రేలో స్పష్టమైన చిత్రాలు వేగంగా వస్తాయి. ఈ మిషన్ ద్వారా ఎముకలు, కీళ్ల వ్యాధుల నిర్ధారణ, ఊపిరితిత్తుల వ్యాధుల నిర్ధారణ, దంతాల, నోటి వ్యాధుల నిర్ధారణతోపాటు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వీలవుతుంది. గురువారం ఉన్నతాధికారుల సమక్షంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చేతుల మీదుగా డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ప్రారంభిస్తారని ఆసుపత్రి సూపరింటెండెంట్ వంశీమాధవ్ తెలిపారు. డిజిటల్ ఎక్స్‌రే తో పాటు ప్రత్యేక ఆపరేటర్‌ను సైతం ఇక్కడ పనిచేసేలా ఉన్నతాధికారులు అలర్ట్ చేశారని తెలిపారు.

అధ్వానంగా భైంసా-కుభీర్ రోడ్డు



కుభీర్ చౌరస్తా వద్ద గుంతలమయంగా రోడ్డు



బ్యాంకు వద్ద రోడ్డు దుస్థితి

- భైంసాలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా నుంచి కుభీర్ వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. స్థానిక కుభీర్ చౌరస్తా నుంచి వివేకానంద చౌరస్తా వరకు గుంతలమయంగా మారింది. మధ్యలో డివైడర్ ఉండగా.. రోడ్డు ఓవైపు విశాలంగా, మరోవైపు కుచించినట్లు ఉంది. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో ఓ వైపు బ్యాంక్, ప్రైవేట్ ఆస్పత్రి ఉంది. పార్కింగ్‌కు స్థలం లేక వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు రోడ్డుపై గుంతలు పూడ్చి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన పద్ధతుల్లో విద్యాబోధన చేయాలి

లక్ష్మణచాంద: విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంతోపాటు ఉపాధ్యాయులు నూతన పద్ధతుల్లో పాఠాలు బోధించాలని ఎంఈవో అశోక్‌వర్మ సూచించారు. బుధవారం లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలంలోని ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణను ఆయన పరిశీలించి మాట్లాడారు. డిజిటల్ బోధనతోపాటు ఏఐ సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు విషయ బోధన మండల రిసోర్స్ పర్సన్లు సాయన్న, గంగాధర్, మోహన్, సీఆర్పీలు సుధాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో అశోక్ వర్మ

దంచి కొట్టిన వాన



శివాజీచౌక్ రోడ్డుపై పారుతున్న వరద

జిల్లాకేంద్రంలో బుధవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. మబ్బులు కమ్ముకొని కురిసిన భారీవర్షానికి రోడ్లపై వరద చేరింది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



కురుస్తున్న వర్షం



కమ్ముకున్న మబ్బులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

భైంసాటౌన్: పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.నారాయణ్‌రావు పటేల్ బుధవారం పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన మహ్మద్ అసిఫ్‌కు రూ.33వేలు, చొండికి చెందిన ఆకుల అఖిలకు రూ.60వేలు, కుభీర్‌కు చెందిన పుప్పాల గంగాధర్‌కు రూ.60వేల విలువైన చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ నాయకులు వివేక్, చొండి రవి తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను క్రమబద్ధీకరించాలి'

ఖానాపూర్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారిని ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం ఆవరణలో పంచాయతీ కార్మికులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. సమావేశంలో శేఖర్, పోశెట్టి, నాగరాజు, నాగరావు, స్వామి ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ముధోల్: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీలతను బుధవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రావుల గంగారెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిషన్‌పటేల్, పతంగి కిషన్, రావుల శ్రీనివాస్, పోశెట్టి, పల్లె నాగేష్, దిగంబర్, భీమ్‌రావు ఉన్నారు.

పరామర్శ

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామానికి చెందిన ముత్యం ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మాజీ జెడ్పీటీసీ సూర్యకాంత్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం సుంక్లికి వెళ్లి మృతికి కారణాలను తెలుసుకున్నారు. ఆయన వెంట చొండి రాజేశ్వర్, నిమ్మ సురేశ్ తదితరులు ఉన్నారు.

పోలీసులకు సన్మానం

మామడ: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్లను బుధవారం పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. రవి, సురేశ్, శంకర్, ప్రసన్నలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'అనర్హులను తొలగించాలి'



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని సత్తనపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అధికారులు తయారు చేసిన జాబితాలో అనర్హులను తొలగించి మరో 32 ఇళ్లను మొదటి విడతలో కేటాయించాలని గ్రామస్తులు కోరారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ప్రీతికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసిన వారిలో 200 మందికి పైగా అర్హులు ఉన్నప్పటికీ అధికారులు అనర్హులతో కూడిన 18 మంది జాబితాను తయారు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రజిత, స్వప్న, శ్రీరంజని, భూమక్క, శేఖర్, ప్రేమల, లక్ష్మి, చంద్రకళ, శంకరవ్వ, సునీత తదితరులు ఉన్నారు.

అధికారులు మారినా.. అవే పేర్లు

- భైంసా ఏడీఏ కార్యాలయంలో తీరు

భైంసాటౌన్: పట్టణంలోని ఏడీఏ (సహాయ వ్యవసాయ సంచాలకులు) కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. పనుల నిమిత్తం ఈ కార్యాలయానికి వచ్చే వారి కోసం అధికారుల పేర్లు, వారి ఫోన్ నంబర్లను బయట గోడపై రాయించారు. కానీ ఇక్కడ పనిచేసిన అధికారులు బదిలీపై మరో చోటకు వెళ్లినా ఇప్పటికీ వారి పేర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో కార్యాలయానికి వచ్చేవారు విస్మయం చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో ప్రస్తుతం పని చేస్తున్న అధికారుల వివరాలు గోడపై రాయించాలని ప్రజలు కోరుతున్నారు.



కార్యాలయం వద్ద పాత అధికారుల పేర్లతో బోర్డు

రైతులను మోసం చేస్తే జైలుకే

లక్ష్మణచాంద: రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎస్సై సుప్రియ హెచ్చరించారు. బుధవారం మండలకేంద్రంలోని రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాల ఫర్టిలైజర్ షాపుల యజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె వ్యవసాయాధికారులతో కలిసి పాల్గొన్నారు. వ్యవసాయ చట్టాలను వివరించి..నిబంధనలు ఉల్లంఘించొద్దని వ్యాపారులకు సూచించారు. ప్రతి రైతు పంట చేతికొచ్చే వరకు రసీదు భద్రపర్చుకోవాలని పేర్కొన్నారు. ఇందులో ఏడీఏ విద్యాసాగర్, ఏవో వసంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై సుప్రియ

ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్యం

నిర్మల్‌టౌన్: ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్యం బారిన పడుతామని.. ప్రజలు బట్ట సంచులు వాడి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని పలు దుకాణాల్లో మున్సిపల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగిస్తున్న షాపులకు రూ.12 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది ఉన్నారు.



జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

'భైంసాలో తైబజార్‌కు వేలం నిర్వహించాలి'

భైంసాటౌన్: పట్టణంలో తైబజార్ నిర్వహణకు బహిరంగం వేలం నిర్వహించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసి విన్నవించినట్లు పేర్కొన్నారు. గడువు ముగిసినా మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని.. అలాగే పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను వివరించినట్లు తెలిపారు. పర్యటించి సమస్యలు పరిశీలించాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు రావుల రాము, నాయకులు గాలి రాజన్న, వెంకటేష్, శ్రీకాంత్, శంకర్, సుభాశ్, సాహెబ్‌రావు, అనిల్ పాల్గొన్నారు.